జాతీయస్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 15 నుంచి ఢిల్లీలో జరుగనున్న జాతీయ స్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలకు జిల్లాకు చెందిని ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఒక రజితం, మూడు కాంస్య పతకాలు సాధించారు. ఈనెల 11 తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి జిఎస్ఎల్ మెడికల్ కాలేజీలో 12వ ఆంధ్ర ప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ ఫెన్సింగ్ ఛాంపియన్షిప్ పోటీలు జరిగాయి. ఉమ్మడివిజయనగరం జిల్లా నుండి హర్షిత శర్మ. ప్రవల్లిక బ్రాంజ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన ఇప్పి ఉమన్ టీం సిల్వర్ మెడల్ సంపాదించగా ఇప్పి మెన్, సేబర్ మెన్, సేబర్ ఉమెన్ టీమ్స్ బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా డిఎస్డిఒ వెంకటేశ్వరరావు, ఫెన్సింగ్ సంఘ సభ్యులు దాలి రాజు, ఎస్ సతీష్ కుమార్, కె.రాంబాబు అభినందనలు తెలిపారు.

భూములు లేక..డబ్బులూ రాక..

- రైతులకు అందని పరిహారం
- జగనన్న కాలనీకి భూములిచ్చిన రైతుల పరిస్థితి దయనీయం
- ఎన్నిసార్లు అర్జీలు పెట్టినా అందని డబ్బులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

సారిక రెవెన్యూ పరిధిలో రైతుల నుంచి తీసుకున్న భూమిలో వేసిన జగనన్న లే అవుట్

అవి ఏడాదికి రెండు పంటలు పండే భూములు..వాటి సాగు ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబ జీవనం సాఫీగా సాగిపోయేది. ఐదేళ్ల క్రితం గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ ఏర్పాటుకు రైతుల నుంచి భూమిని బలవంతంగా కొనుగోలు చేసింది. తప్పని పరిస్థితుల్లో భూములిచ్చిన రైతులకు నేటికీ డబ్బులు చెల్లించకపోవడంతో ఆయా గ్రామాల రైతులు లబోదిబోమంటున్నారు. అటు భూములు లేక..ఇటు డబ్బులు రాక జీవనోపాధి పోయిందని కన్నీరు పెడుతున్నారు.

రాష్ట్రంలో 2019లో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్నికల హామీలో భాగంగా జగనన్న కాలనీల ఏర్పాటుకు ప్రభుత్వం భూ సేకరణ చేపట్టింది. అందులో భాగంగా జిల్లాలోని విజయనగరం మండలం సారిక రెవెన్యూ పరిధిలో గల సారిక, గుండాలపేట గ్రామాల రైతుల నుంచి సుమారు 105 ఎకరాల రెండు పంటలు పండే భూములను జగనన్న కాలనీ కోసం ప్రభుత్వం సేకరించింది. 2020సంవత్సరంలో మొదటి విడతగా 40 ఎకరాలను ఎకరా రూ.52 లక్షలు చొప్పున రైతుల నుంచి సేకరించారు. రెండో విడతగా 60ఎకరాల పైన భూమిని రూ.62.50 లక్షలు చొప్పున రైతులు నుంచి భూమిని సేకరించారు. ఈ సేకరించిన భూమిలో సుమారు 75 శాతం రైతులకు ప్రభుత్వం డబ్బులు చెల్లించింది. అయితే ఇంకా సారిక గ్రామంలో 20 ఎకరాలకు సంబంధించి రైతులకు సుమారు 10 కోట్ల 40 లక్షల పైన చెల్లించాల్సి ఉంది. గుండాలపేట గ్రామపంచాయతీ పరిధిలో ఐదు ఎకరాల పైన భూమికి గాను సుమారు గా 3 కోట్ల 12 లక్షల 50వేల రూపాయలు చెల్లించాల్సి ఉంది. జగనన్న కాలనీకి భూములు సేకరించి సుమారు ఏడేళ్లయినా రై తులకు పరిహారం చెల్లించక పోవడంతో వారంతా లబోదిబో మంటున్నారు. అటు పంటలు లేక..ఇటు భూములు పోయి డబ్బులు రాక ఆందోళన చెందుతున్నారు. డబ్బులు వస్తే ఏదో ఒక వ్యాపారం చేసుకొని జీవనోపాధి సాగిద్దామనుకున్న రైతులకు తీవ్ర నిరాశే మిగులుతోంది. మరోవైపు పిల్లల చదువులు, పెళ్లిళ్లకు డబ్బులు లేకపోవడంతో కాలాన్ని నెట్టుకొస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా పరిహారం చెల్లింపుపై స్పందించకపోవడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. ఆ భూములను ఇళ్ల స్థలాల కోసం లబ్ధిదారులకు కేటాయించారు. ఆ భూముల్లో ఒక్క లబ్ధిదారు కూడా ఇల్లు కట్టకపోవడంతో వేసిన సర్వే రాళ్ల దిష్టిబొమ్మల్లా దర్శనిస్తున్నాయి. పరిహారం కోసం గత కొన్నాళ్లగా అధికారులకు వినతులు ఇస్తున్నా ఎటువంటి స్పందనా లేకపోవడంతో భూములిచ్చిన రైతులు కన్నీటి పర్యాంతమవుతున్నారు. టిడిపి ప్రభుత్వమైనా స్పందించి డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం

భూములు తీసుకొని ప్రభుత్వం డబ్బులు చెల్లించక పోవడంతో పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. జగన్న కాలనీకి సంవత్సరానికి రెండు పంటలు పండే ఎకరన్నర భూమిని నా వద్ద తీసుకున్నారు. దీంతో పంట పొలమూ లేక డబ్బులు రాక పిల్లల చదువులకు, కుటుంబ పోషణకు అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే పరిహారం చెల్లించాలి.

పిట్ట అప్పలరాజు సారిక గ్రామం,

బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి

రైతులకు ఇంకా పరిహారం రావాల్సిన విషయం వాస్తవమే. గృహ వసతి పోర్టల్‌లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎక్కువ మందికి పరిహారం చెల్లించారు. ఇంకా కొద్దిమందికి రైతులకు మాత్రమే డబ్బులు రావాల్సి ఉంది. ప్రభుత్వం ఇంకా నిధులు విడుదల చేయలేదు.

ఎన్. కూర్మనాధరావు, తహశీల్దార్, విజయనగరం

నా కుమార్తె పెళ్లికి పడరాని పాట్లు పడ్డాను

జగనన్న కాలనీకి ఇచ్చిన భూమికి పరిహారంగా డబ్బులు వస్తాయని ఆశించి నా కుమార్తె వివాహం నిశ్చయించుకున్నాము. ఆ డబ్బులు అందకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎందరో అధికారులకు, నాయకులకు అర్జీలు పెట్టుకున్నా ఫలితం కనిపించడం లేదు. పిల్లల పెళ్లి కంటే ఇంకేమైనా కష్టం ఉంటుందా? సుమారు నాకు సుమారు రూ.50 లక్షలు రావాల్సి ఉంది ఆ డబ్బులతో కుమార్తె వివాహం తాపీగా చేద్దామనుకున్నాను. ఆ పరిస్థితి లేకుండా పోయి నానా అవస్థలు పడాల్సి వచ్చింది.

కంది జగదీష్ కుమార్, గుండాలపేట

భూమైనా ఇప్పిస్తే పంటలు పండించుకుంటాం

జగనన్న కాలనీకి ఎకరా భూమిని ఇచ్చాను. ఇప్పటికీ ఆ భూమి తాలూకా డబ్బులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. ఏడేళ్ల నుంచి ఎటువంటి ఆదాయమూ లేక కుటుంబం నడపడమే భారంగా ఉంది. ఆ భూములు ఖాళీగా ఉన్నాయి. ఆ భూమైనా ఇప్పిస్తే పంట పండించుకుని బతుకుతాం.

గంగిరెడ్ల పెంటయ్య , సారిక గ్రామం

భోగాపురంలో పైలెట్ ప్రాజెక్టు

జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు

ప్రజాశక్తి - భోగాపురం

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ మాణిక్యం నాయుడు

రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ, శిశుసంక్షేమ శాఖలను సమన్వయపరుస్తూ ఒక పైలెట్ ప్రాజెక్టును త్వరలో ప్రారంభించనుందని డిఇఒ మాణిక్యంనాయుడు, శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విమలారాణి తెలిపారు. జిల్లాలో ఈ ప్రాజెక్ట్ అమలు కు భోగాపురం మండలాన్ని ఎంపిక చేశారని తెలిపారు. గురువారం స్థానిక ఎంఇఒ కార్యాలయాన్ని సందర్శించిన డిఇఒ మాణిక్యం నాయుడు ఎంఇఒ రమణమూర్తి, చంద్రమౌళి, సిడిపిఒ లావణ్యలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాబోయే పైలెట్ ప్రాజెక్టుకు సంబంధించిన విధి విధానాలు, వసతి సదుపాయాలపై విస్తృతంగా చర్చించారు. ప్రాథమిక పాఠశాలకు 300 మీటర్ల పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను ఆ పాఠశాలల్లోనే నిర్వహించేలా రూపు దిద్దడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఇప్పటికే మండలంలో 12 ప్రాథమిక పాఠశాలలను ఈ ప్రాజెక్టు కోసం గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమం జిల్లాలో విజయవంతమైతే రాష్ట్రమంతటా అమలు చేస్తారని చెప్పారు.

పదో తరగతి ఫలితాల్లో శతశాతం సాధించాలి

పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని డిఇఒ మాణిక్యంనాయుడు ఆదేశించారు. మండలంలోని రెడ్డికంచేరు పాఠశాలను ఆయన సందర్శించారు. ఆ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. రాబోయే వార్షిక పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం పిన్నింటి పాలెం, అమాటాం, రాయివలస పాఠశాలలను సందర్శించారు. ఈయనతో పాటు ఎంఇఒ రమణమూర్తి ఉన్నారు.

విమానాశ్రయానికి విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్తు సరఫరాకు ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ వద్ద అధికారులు

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి విద్యుత్ సరఫరా ను గురువారం స్విచ్ ఆన్ చేసి విద్యుత్ శాఖ బోర్డు డైరెక్టర్ టివి సూర్య ప్రకాశ్ ప్రారంభించారు. జిఎంఆర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి విద్యుత్ సరఫరా పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చినట్లు ఆయన తెలిపారు. విమానాశ్రయ నిర్మాణ పనులు జరుగుతున్న సందర్భంలో పనులకు ఎటువంటి ఆటంకమూ లేకుండా విద్యుత్ సరఫరా పూర్తి చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిఎంఆర్ సిడిఒ ఎం.కోటేశ్వరరావు, విద్యుత్ శాఖ సూపరెండెంట్ ఇంజినీర్ మువ్వల లక్ష్మణరావు, రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సురేష్ బాబు. విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ సేవా సంఘం ప్రతినిధులు

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 14 నుండి 20 వరకు జరుగబోయే 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని జిల్లా గ్రంథాలయ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు నాలుగెస్సులరాజు, అధ్యక్షులు ఎర్నాయుడు, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ తెలిపారు. గురువారం సంఘ కార్యాలయంలో వారోత్సవాలకు సంబంధించిన షెడ్యూల్ కరపత్రాలను విడుదల చేసారు. అనంతరం మాట్లాడుతూ 14న ఎం. ఆర్. కాలేజీలో ఉదయం 10 గంటలకు వారోత్సవాల ప్రారంభం కార్యక్రమం ఉంటుందని, 15న ఉదయం 10 గంటలకు కోట జంక్షన్, ఆర్ అండ్ బి జంక్షన్‌లో 'పుస్తక హుండీ' కార్యక్రమం ఉంటుందని, 16న జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని గాజులరేగ శాఖా గ్రంథాలయంలో సీనియర్ పాత్రికేయులకు సత్కార కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. 17న ఆర్అండ్‌బి జంక్షన్ వద్ద పుస్తక ప్రదర్శన, సగం ధరకే పుస్తకాలు అమ్మకం, 18న ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మధ్యాహ్నం 2 గంటలకు పుస్తక వితరణ, 19న మహిళా దినోత్సవాన్ని ఉదయం 10గంటలకు గురజాడ గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని, సాయంత్రం 6 గంటలకు పుస్తక పరిచయం, 20 న వ్యాసరచన విజేతలకు బహుమతి ప్రధానం వుంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కె.దయానంద్, ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, జెవివి జిల్లా అధ్యక్షులు ఎం.వి.ఎన్ వెంకటరావు, సంఘం పట్టణ కన్వీనర్ త్యాడా ప్రసాద్ పట్నాయక్, గమ్యం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు వేమలి చైతన్య బాబు, శ్రీ రామ్మూర్తి, కాశినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సహకార వారోత్సవాలు

జిల్లా వ్యాప్తంగా 149 సొసైటీ ల్లో అవగాహన కార్యక్రమాలు : జిల్లా సహకార అధికారి రమేష్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జిల్లా వ్యాప్తంగా 149 సొసైటీలలో ఈనెల 14 నుంచి 20 తేదీ వరకు సహకార వారోత్సవాలు నిర్వహిస్తు న్నట్లు జిల్లా సహకార అధికారి పి.రమేష్ తెలిపారు. గురువారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రతి ఏడాది ఒక నినాదంతో ఈ సహకార వారోత్సవాలను నిర్వహిస్తా మన్నారు. ఈ ఏడాది దేశాభివృద్ధిలో కోపరేటివ్ పాత్ర అనే నినాదంతో వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 65 పిఎసిఎస్ సొసైటీలతోపాటు వివిధ సొసైటీలు కలుపుకొని మొత్తంగా 149 సొసైటీల్లో వారోత్సవాలు జరుగుతాయన్నారు. ఈనెల 14న డిసిసిబి కార్యాలయంలో, 15న విజయనగరం ఎంప్లాయిస్ సొసైటీలో, 16న గజపతినగరం పిఎసిఎస్‌లో, 17న పోలిపల్లి పిఎసిఎస్‌లో, 18న విజయనగరం ఆఫ్కో భవనంలో, 19న శృంగవరపుకోట పిఎసిఎస్‌లో, 20న డిసిఎంఎస్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తా మన్నారు. సహకారంగంలో డిజిటలైజేషన్ సహకార యూనివర్సిటీ రిసోర్స్‌పై చర్చించడం, గ్రామీణాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర ,పర్యావరణ పరిరక్షణ ,టూరిజం హెల్త్ గ్రీన్ ఎనర్జీ తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు .ఆయా పిఎసిఎస్ చైర్మన్‌లు ఉద్యోగులు పాల్గొంటారని తెలిపారు వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఓటర్ల జాబితా పరిశీలన పూర్తి చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2002 లో నమోదైన ఓటర్లను 2005 సంవత్సరంతో సరిపోల్చే విధానాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని బూత్‌లెవెల్ అధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. గురువారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పెషల్ ఇన్సెంటివ్ రీజన్ (సర్) విధానం ద్వారా ఓటర్ల వివరాలు సరిపోల్చే ప్రక్రియయుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఆయా ఓటర్ల వివరాలు సరిపోల్చాలన్నారు. విజయనగరం నియోజకవర్గం ఈ విధానం అమలు లో వెనుకబడి ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. స్పెషల్ ఇన్సెంటివ్ రీజన్ ద్వారా ఎటువంటి అవకతవకలూ లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేసే అవకాశం ఉందని అన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ఇడిటి గాంధీ పాల్గొన్నారు.

ఫార్మసీ రంగంలో మెరుగైన ఉపాధి

జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ వివి సుబ్బారావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫార్మసీ రంగాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీతో జోడించి ఉపాధి అవకాశాలు మెరుగుపడే విధంగా బి-ఫార్మసీ కోర్సును తీర్చిదిద్దామని విజయనగరం జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వివి సుబ్బారావు తెలిపారు.. గురువారం జెఎన్‌టియులో కాలేజ్ ఆఫ్ ఫార్మాసిటికల్ సైన్స్ బ్రాంచ్‌ను నూతనంగా ప్రారంభించారు. ఇందులో బి-ఫార్మసీ కోర్సును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విసి ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమాజంలో ఔషధ శాస్త్రం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. దేశ విదేశాల్లో ఫార్మసీ రంగంలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఇటీవల కోవిడ్ సమయంలో భారతదేశంలో ఉత్పత్తి అయిన ఫార్మసీ ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలు గుర్తించాయని కొనియాడారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కొన్ని రంగాల్లో ఉపాధి తగ్గుతున్ననేపథ్యంలో దాన్ని జోడించి మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని ఆయన వివరించారు. గౌరవ అతిథి గా విచ్చేసిన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమా మాట్లాడుతూ యూనివర్సిటీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, విద్యార్థుల ప్రతిభను నిరూపించుకొని పోటీతత్వంతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ఆంధ్ర యూనివర్సిటీ ఫార్మసిటికల్ సైన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈశ్వర్ కుమార్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలకు ఫార్మసీ విభాగం ప్రత్యేక హబ్ గా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్‌కే రాజేశ్వరరావు, జెఎన్‌టియు డైరెక్టర్స్ ప్రొఫెసర్ కెబి రావు, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ జిజె నాగరాజు, ఫార్మసీ అధ్యాపకులు, డాక్టర్ స్వాతి, జాకీర్ హుస్సేన్, వాసవి ,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సత్య కళాశాల విద్యార్థికి బాక్సింగ్‌లో రజిత పతకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల ఆంధ్ర యూనివర్సిటీ లో జరిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంటర్ కాలేజియేట్ బాక్సింగ్ పోటీలలో సత్య డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థి చైతన్య ద్వితీయ స్థానాన్ని పొంది రజిత పతకం సాధించాడు. విద్యార్థుల కృషి, కోచ్‌ల మార్గదర్శకం, కళాశాల నిర్వహణ సహకారం ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయని కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో మరింత విజయాలు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ సి సి ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.ఉదయ్ కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి .సూరపనాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరింత బాధ్యతగా పని చేయాలి : ఎమ్మెల్యే

పలు కమిటీల అధ్యక్షులు, సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

పలు కమిటీలకు అధ్యక్షులుగా, సభ్యులుగా నియమితులైన వారంతా మరింత బాధ్యతగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. టిడిపి అంటేనే కార్యకర్తలు, ప్రజలు అని అన్నారు. గురువారం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, విజయనగరం టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున ఆధ్వర్యాన విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి నూతనంగా నియమించిన టిడిపి మండల,పట్టణ, గ్రామ, వార్డు కమిటీలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిల ప్రమాణస్వీకార కార్యక్రమం అశోక్‌బంగ్లాలో జరిగింది. జెండా ఆవిష్కరణ అనంతరం మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు వివిధ స్థాయిల్లో నూతనంగా పార్టీ ప్రతినిధులుగా ఎన్నికైన వారితో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ఆశయాలకు అనుగుణంగా పార్టీని ముందుకు తీసుకెళ్లాలన్నారు. జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నారని అన్నారు. పదవులు అలంకరణ కాదని, బాధ్యతగా పనిచేయాలని అన్నారు. కార్యక్రమానికి పట్టణ అధ్యక్షులు గంటా రవి, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు అధ్యక్షత వహించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు ఏడాదిన్నర కాలంలో పార్టీ చేసిన, చేయబోతున్న అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పట్టణ, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

27వ డివిజన్ టిడిపి అధ్యక్షుడిగా మల్లేశ్వరరావు

నగరంలోని 27వ డివిజన్ అధ్యక్షులుగా కింతాడ మల్లేశ్వరరావు నియమితులయ్యారు. పాధ్యక్షులుగా వంకర గురుమూర్తి, ప్రధాన కార్యదర్శిగా మైలపల్లి శ్రీనివాస, కార్యనిర్వాహక కార్యదర్శిగా గోక ఈశ్వరరావు, బట్టాన చిన్న, రుప్ప శ్రీనివాస్, కార్యదర్శులుగా బెల్లాన విజయభాస్కర్, టి. వసంత్, కె. రాజా, కోశాధికారిగా ఎం. రమేష్ నియమితులయ్యారు. వార్డు మహిళా కమిటీ అధ్యక్షురాలుగా వై. మల్లీశ్వరి, ప్రధాన కార్యదర్శిగా ఆర్. సత్యవతి నియమితుల య్యారు. గురువారం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో నిర్వహించిన ప్రమాణ స్వీకారం లో వీరికి నియామక పత్రాలు అందజేసి ఎమ్మెల్యే అభినందించారు. పార్టీని మరింత బలోపేతం చేస్తూ అందరిని కలుపుకుంటూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి రవిశంకర్, పార్టీ సీనియర్ నాయకులు డి.రాంపైడి(బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన గోనె సంచులు ఇవ్వాల్సిందే

ప్రజాశక్తి-గజపతినగరం

రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు నాణ్యమైన గోనె సంచులు ఇవ్వాల్సిందేనని తహశీల్దార్ రత్నకుమార్ అన్నారు. రైస్ మిల్లర్ల సంఘం, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ, వ్యవసాయశాఖ అధికారులతో గురువారం స్థానిక తాహశీల్దార్ కార్యాలయంలో సమావేశం జరిగింది. తహశీల్దార్ రత్న కుమార్ మాట్లాడుతూ...మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌కు సుమారు 2 లక్షల గోనె సంచులు అవసరమని రైస్ మిల్లర్లకు తెలిపారు. పాత సంచులకు బదులుగా, మిల్లర్లు తమకు కేటాయించిన గోనె సంచులను తరచూ చిరిగిపోయిన, పాడైపోయిన స్థితిలో ఇస్తున్నారని రైతులు ఫిర్యాదు చేస్తున్న నేపథ్యంలో, ఈ ఏడాది కొనుగోలు కేంద్రాల వద్ద కచ్చితంగా నాణ్యమైన గోనె సంచులను మాత్రమే పంపిణీ చేయాలని ఆదేశించారు. పాత, నాణ్యత లేని సంచుల కారణంగా రైతుపై అదనపు భారం పడకుండా చూడాలని స్పష్టం చేశారు. బ్యాంకు గ్యారెంటీలను ఇకపై నూతన విధానం ప్రకారం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలని, ఈ ప్రక్రియలో ఎటువంటి జాప్యం ఉండకూడదని తెలిపారు. రైతు సేవా కేంద్రాల (ఆర్ ఎస్ కె) వద్ద తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను కొలిచేందుకు ఉపయోగించే మాస్చరింగ్ (తేమ కొలిచే) యంత్రాలు మిల్లర్స్ కూడా అవే కంపెనీకి చెందినవి, సరిగా పనిచేసే వాటిని మాత్రమే వినియోగించాలని, తద్వారా తేమ కొలతల్లో రైతులకు ఎటువంటి అనుమానాలకు తావులేకుండా చేయాలని తహసీల్దార్ సూచించారు. తేమ శాతం పూర్తిగా వైర్లెస్ బ్లూటూత్ విధానం ద్వారా మిల్లర్ల దగ్గర నుంచి సంబంధిత అధికారులకు వెళుతుందని, దానికి అనుగుణంగా కొనుగోలు జరిపి అమ్మిన రెండు గంటల్లోనే ధాన్యం సొమ్ము రైతు ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. ఈ విధానాలన్నింటినీ పక్కాగా అమలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ పూర్తి చేయాలని అధికారులను, మిల్లర్లను కోరారు. సమావేశంలో సిఎస్‌డిటి తిరుపతిరావు, ఎఒ కిరణ్ కుమార్, మిల్లర్స్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి వేపాడ మండల అధ్యక్షుడిగా

గొంప వెంకట్రావు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- వేపాడ



గొంప వెంకటరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

టిడిపి వేపాడ మండల అధ్యక్షులుగా గొంప వెంకటరావు, ప్రధాన కార్యదర్శిగా కొట్యాడ రమణమూర్తి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. బానాది గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడైన వెంకటరావు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నాటి నుంచే పార్టీ పట్ల అచంచలమైన విశ్వాసంతో కొనసాగుతున్నారు. ఈనేపథ్యంలో అధ్యక్షుడిగా నియమితులైన ఆయనతో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి లక్కవరపుకోటలోని టిడిపి కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు. మండలంలోని పార్టీ శ్రేణులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ ఇన్‌ఛార్జీలు, మహిళా నాయకులు, యువత, అభిమానులు భారీగా హాజరయ్యారు. గొంప వెంకట్రావు పార్టీకి చేస్తున్న కృషికి గుర్తింపుగా అధ్యక్ష పదవి లభించింది. గతంలో రెండు సార్లు ఏకగ్రీవంగా వేపాడ మండల టిడిపి అధ్యక్షుడిగా పనిచేసిన ఆయనను ఈసారి కూడా పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఐవిఆర్ఎస్ పద్ధతిలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపి తిరిగి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, మండల నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, వార్డు సభ్యులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గొంప వెంకటరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను టిడిపి జెండా ఎగురవేయడమే తన లక్ష్యమని అన్నారు. వేపాడ మండలంలో పార్టీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి పి.ఈశ్వరరావు గురువారం తెలిపారు. ఈ వారోత్సవాలు ఎంపిపి, వైస్ ఎంపిపితో పాటు గ్రంథాలయ పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభిస్తామన్నారు. ఈ వారం రోజులపాటు క్రీడలు, రంగవల్లులు, క్విజ్ పోటీలను నిర్వహిస్తామన్నారు. 14 న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం, నెహ్రూ జయంతి వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, గ్రంథాలయ సభ్యత్వం నమోదు, 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ, 17న కవి సమ్మేళనం, చిత్రలేఖనం, 18న విద్యార్థులకు చంద్రయానం 2, వ్యాసరచన పోటీలు, 19న ఇంద్ర గాంధీ జయంతి వేడుకలు, మహిళ దినోత్సవం, 20న ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం, ముగింపు వేడుకలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

నందిగాంలో పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని నందిగాం గ్రామంలో రైతు నల్ల జోగినాయుడు పొలంలో గురువారం ఉచిత పంటల బీమాకు సంబంధించి పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు పి.సి నందా, యు.సురేష్, వి.ఎ.ఎ డి.వాసవి, ఎపిసి ఇన్సూరెన్స్ ఏజెంట్ ఎల్.గోవర్ధన రైతులు పాల్గొన్నారు.

దుర్గంధంగా ఉన్న చెత్త తొలగింపు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

మండలంలోని బొడ్డవర వద్ద విశాఖ అరకు రహదారికి ఆనుకొని రహదారి పక్కనే గత కొన్నేళ్లుగా గ్రామంలోని చెత్తను డంప్ చేయడంతో ఆ చెత్త దుర్గంధంగా మారి రోడ్డున పోయే వారికి ఇబ్బందిగా మారింది. కొందరు ఆ చెత్తను మంట పెట్టడంతో పొగ ఏర్పడి విశాఖ అరకు రహదారిలో ప్రయాణించే వాహనాలకు దారి కనబడక ఇబ్బందులు తలెత్తేవి. దీంతో స్థానికులు, పర్యావరణవేత్త బొబ్బిలి రామకృష్ణ ఫిర్యాదు మేరకు బొడ్డవర గ్రామ పంచాయతీ సెక్రటరీ బంగారునాయుడు గురువారం జెసిబి ట్రాక్టర్ల సహాయంతో మొత్తం చెత్తను క్లీన్ చేయించి బ్లీచింగ్ చల్లించారు. దీంతో వాహనదారులు స్థానికులు పంచాయతీ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

గిరిజనులను తక్షణమే ఆదుకోవాలి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

జిందాల్ కి భూములిచ్చి సర్వం కోల్పోయిన గిరిజనులను తక్షణమే ఆదుకోవాలని సిపిఎం నాయకులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. గురువారం బొడ్డవరలో నిర్వాసిత శిబిరం వద్ద నిర్వాసితులు గిరిజన సాంప్రదాయ ఆటలు, ఆటలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ గతంలో నిరుపేదలుగా గుర్తించి జీవనోపాధి చేసుకొంటున్న ప్రభుత్వ డీ ఫారం భూమి ఇస్తే నిర్వాసితుల వద్ద ఉన్న మొత్తం భూమిని మోసపూరితంగా వ్యవహరించి మూడు సంవత్సరాల్లో కంపెనీ కట్టి అందులో అందరికీ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి, ఉద్యోగాలతో పాటు కంపెనీలో షేర్లు ఇస్తామని నమ్మబలికి భూమంతా తీసుకున్నారన్నారు. భూమి తీసుకుని 18 సంవత్సరాలు దాటినా ఎటువంటి కంపెనీ నిర్మించకుండా భూమిని అమ్ముకొని పెట్టడం అన్యాయమన్నారు. నిర్వాసితులకు తిరిగి భూములను అప్పగించాలని డిమాండ్ చేశారు.

వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి - కొత్తవలస

కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తింపు సర్వేపై గురువారం వియ్యంపేట పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ల్యాప్రోసీ కేసు డిటెక్షన్ అవగాహన (ఎల్‌సిడిసి)పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. పిహెచ్‌సి పరిధిలో 5,695 గృహాల్లో 20 టీమ్‌ల ఇంటింటి సర్వే చేసి వ్యాధి గ్రస్తులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒ. నరసింహారావు, సోడల్ సభ్యుడు ఈశ్వరరావులు పిహెచ్ఎన్ జగదాంబ, హెల్త్ పద్మావతి, హెచ్ఎస్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎమ్, ఆశ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధుల హక్కులకు భంగం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ప్రజా ప్రతినిధుల హక్కులకు భంగం కలుగుతుందని ఎపి టూరిజం బోర్డు డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి అన్నారు. గురువారం మండలంలోని చీమలపల్లి, వసి, తిమిడి గ్రామాల్లో ఆమె ఆర్థిక సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో పలు సమస్యలు, తాజా రాజకీయ పరిస్థితులు, రానున్న స్థానిక ఎన్నికల సన్నాహాలు పలు కీలక అంశాలతో పాటు బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులు గత 152 రోజులుగా నిర్వహిస్తున్న నిరసనలు, నిరాహార దీక్షల పట్ల తమ మద్దతు తెలిపారు. ఇప్పటికే తమ నాయకుల మీద బైండోవర్ కేసులు పెట్టారని, గ్రామ సభలకు అడ్డు తగలరని, ఎన్నికైన ప్రజాప్రతినిధుల హక్కులకు భంగం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, తిమిడి సర్పంచ్ వబ్బిన త్రినాథమ్మ ఎంపిటిసిలు వాకాడ సింహాచలం, మజ్జి దేవి, నాయకులు బోజంకి గోవింద్, కారుకొండ వెంకటరావు, వబ్బిన సతీష్, కటుయ్య, చామలపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ కళాశాలలో ప్రవేశాలు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

మండలంలోని భవాని నగర్‌లో గల డాక్టర్ వరలక్ష్మి వ్యాయామ కళాశాలలో 2025-27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల యాజమాన్య ప్రతినిధులు రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ వరలక్ష్మి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.భార్గవ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒసి, ఒబిసి, ఇడబ్ల్యుఎస్‌ఎకు స్పాట్ మేనేజ్‌మెంట్ ప్రవేశాలు ఇస్తామన్నారు. అర్హులైన కావలసిన విద్యార్థులు తగిన ధ్రువపత్రాలను పట్టుకుని ఈ నెల 16వ తారీఖులోపు కళాశాలను సంప్రదించాలని కోరారు.

డాక్యుమెంట్స్ ఉంటేనే మ్యూటేషన్ ఆమోదం

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

అన్ని రకాల డాక్యుమెంట్స్ ఉంటేనే మ్యూటేషన్ అమోదిస్తామని తహశీల్దార్ ఎం.శ్రీను అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం డిజిటల్ అసిస్టెంట్లు, మీసేవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు మరణిస్తే వారి మరణ ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్, కోర్టు తీర్పు భూములకు సంబంధించిన కోర్టు తీర్పు పత్రాలు, భూమి కొనుగోలు చేస్తే రిజిస్టర్ డాక్యుమెంట్స్ ఉంటేనే ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. సంబంధించిన డాక్యుమెంట్స్ లేకపోతే రిజెక్ట్ చేస్తామన్నారు. సమావేశంలో ఎంపిడిఒ రవికుమార్ ఉన్నారు.

ఇకెవైసి లేకుంటే పనులు కల్పించలేం

ప్రజాశక్తి- రేగిడి

గ్రామస్థాయిలో ఉపాధి వేతనదారులకు ఇకెవైసి లేకుంటే ఏడాది పొడవునా పనులు కల్పించలేమని ఎంపిడిఒ శ్యామల కుమారి, ఎపిఒ సంకటిపల్లి హరినాథ్ అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో 27,080 జాబుకార్డులు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఉపాధి కూలీకు ఆధార్, జాబుకార్డుతో ఇకెవైసి తప్పనిసరి చేయాలన్నారు. రోజువారి 20 నుంచి 30 వరకు ఇకెవైసి జరగాల్సి ఉండగా అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎపిఒ2, ఇసి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణంగా ప్లాస్టిక్ నిషేధం అమలు

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీలో సంపూర్ణంగా ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆలిండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సంస్థ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్ సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. పట్టణంలో ఎక్కడైనా ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సమావేశంలో టిపిఆర్ఒ జగన్మోహన్, శానిటేషన్, రెవెన్యూ ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కుమ్మపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ ద్వారా జరుగుతున్న పనులను గురువారం ఎంపిడిఒ సి హెచ్ సూర్యనారాయణ పరిశీలించారు. రైతు కలిమాలు గంగులు పూర్తి చేసిన క్యాటిల్ షెడ్ సందర్శించారు. దొగ్గ లక్ష్మి ఫారం పండును, లోకిరెడ్డి స్వామి నాయుడు కంపోస్ట్ పిట్ ను పరిశీలించారు. ఆయన వెంట ఎపిఒ, పంచాయతీ కార్యదర్శి ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల లక్ష్యంగా పని చేయాలి

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ నజీర్

పలు కమిటీ నాయకుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

స్థానిక సంస్థలు ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా టిడిపి కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ నజీర్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, నియోజకవర్గం ఇంచార్జి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం నగర పంచాయతీలో టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో టిడిపి మండల, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోయే సర్పంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, సీనియర్ నాయకులు కంది చంద్ర శేఖర్‌రావు, డెంకాడ, పూసపాటి రేగ మాజీ జడ్‌పిటిసిలు పతివాడ అప్పల నారాయణ, ఆకిరి ప్రసాద్, భోగాపురం, డెంకాడ, పూసపాటి రేగ మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, పల్లె భాస్కర్ రావు, మహంతి శంకరరావు, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్లమెంట్ కార్యదర్శి లెంక అప్పలనాయుడు, క్లస్టర్ ఇంచార్జి అట్టాడ శ్రీధర్ పాల్గొన్నారు.

బొబ్బిలి: టిడిపి బలోపేతానికి ఐక్యంగా పని చేయాలని ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు రాజా కోరారు. స్థానిక కోటలో గురువారం పట్టణ, మండల కమిటీలతో ప్రమాణస్వీకారం చేపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో టిడిపిను బలోపేతం చేసేందుకు నూతన కమిటీలు, కార్యకర్తలు కలిసి పని చేయాలన్నారు. బొబ్బిలి పట్టణ, మండలం, బాడంగి, తెర్లాం, రామభద్ర పురం మండల కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులతో ప్రమాణస్వీకారం చేపించారు. ఈ అకార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: గరికిపేట బిఎల్ఒ బంగారినాయుడును సత్కరిస్తున్న టిడిపి నాయకులు

శృంగవరపుకోట: టిడిపికి కష్ట కాలంలో అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం లక్కవరపుకోటలోని టిడిపి కార్యాలయం మండల, గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకటరత్నాజీ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల రామకృష్ణ, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ సేనల నానాజీ, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్స్ నానిగిరి రామనాజీ, గనివాడ బంగారు నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ జీ.ఎస్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు డోకుల అచ్చెం నాయుడు, కరేడ్ల ఈశ్వరరావు, గొంప వెంకటరావు, కోళ్ల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేయాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. వివిధ పదవులకు నియమితులైన నాయకుల చేత కళా వెంకట్రావు మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్ నాయుడులు గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో నియోజకవర్గంలోని మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల నూతన కార్యవర్గ సభ్యులను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షునిగా విజయభాస్కర్

రామభద్రపురం: టిడిపి మండల అధ్యక్షునిగా ఇట్లా మామిడిపల్లి గ్రామానికి చెందిన కరణం విజయభాస్కరరావు నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా సిరిపురపు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా చింతల చినమ్మతల్లి, కార్యదర్శులుగా పత్తిగుళ్ల యోగినాయుడు, బర్ల రామారావు, శిష్టు సత్యనారాయణ, ముల్లు సురేష్, జాయింట్ సెక్రటరీగా లెంక శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా సామురోతు రామారావులు నియమితులయ్యారు. వీరిని ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మంనాయుడు, జిల్లా టిడిపిఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు అభినందించారు.

పరీక్షా కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి - వంగర

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ

మార్చి నెలలో జరగనున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను చీపురుపల్లి డిప్యూటీ డిఇఒ కె.రమణమూర్తి గురువారం మండలంలోని ఎం సీతారాంపురం, వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు మడ్డువలసలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలను పరిశీలించారు. ఈ పరీక్ష కేంద్రాల్లోనీ మౌలిక వసతులు, తరగతికి గదులను క్షుణంగా పరిశీలించారు. అనంతరం ఆ పాఠశాల్లో జరుగుతున్న ఎస్ఎ-1 పరీక్షలను పరిశీలించారు. ఆయన వెంట కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ కె.సన్యాసిరాజు, గ్రేడ్2 హెచ్ఎంల అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వి.నారాయణరావు, ఎంఇఒ మీసాల కూర్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

రేగిడి: 10వ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలూ కల్పనకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డిఇఒ కెవి రమణ అధికారులకు ఆదేశించారు. గురువారం మండలంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలైన ఏవీపురం, రేగిడి, సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట డిసిఇబి చైర్మన్ సన్యాసిరాజు, వావిలపల్లి నారాయణరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొప్పర శ్రీనివాసరావు, సిఆర్ఎంటి ఆదినారాయణ, రామినాయుడు ఉన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని అలుగోలుకు చెందిన కబడ్డీ క్రీడాకారులకు గ్రామ టిడిపి అధ్యక్షులు, జిల్లా పరిషత్ హై స్కూల్ కమిటి చైర్మన్ ఆల్తి బాబురావు క్రీడాదుస్తులను గురువారం వితరణగా అంద జేశారు. కబడ్డీ క్రీడాకారుల ప్రతిభను మరింత ప్రోత్స హించడానికి ఈ దుస్తులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. యువత క్రీడల్లో రాణించాలని, నిత్యం వ్యాయామం శారీరక ఆరోగ్యం యువత కాపాడు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఐటిడిపి అధ్యక్షుడు బొమ్మిడి రాము, యువత పల్ల అయ్యప్ప, నక్కెళ్ళ హరిబాబు, నక్కెళ్ళ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మాధవి

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు నెల్లిమర్ల బాలి కొన్నత పాఠశాల విద్యార్థి బంగారు మాధవి ఎంపికైనట్లు హెచ్ఎం జి.ఎం. శారద తెలిపారు. ఎస్‌జిఎఫ్ఐ క్రీడల్లో భాగంగా అండర్ 19 కబడ్డీ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని హెచ్ఎంతో బాటు పీడీ ఆనంద్ కిషోర్, సిబ్బంది, తదితరులు అభినందించారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ

కొత్తవలస: ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీలో నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వాగ్దేవి కళాశాల విద్యార్థి నందవర్ధన్ సత్తా చాటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించు ఖేలో ఇండియా టోర్న మెంట్‌కి అర్హత సాధించాడు. ఈ టోర్నమెంట్ ఈ నెల 24 నుండి 28వరకు జరగనుందని కళాశాల కరెస్పాండెంట్ కోటిన మహేశ్వరరావు తెలిపారు. కళాశాల డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అకాడమీలో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

నెల్లిమర్ల: నూతన దుస్తులతో క్రీడాకారులు, దాత

శృంగవరపుకోట: ఎల్‌కోట మండలంలోని చందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు కొత్తవలసకు చెందిన క్రీడాభిమాని 15 వేల రూపాయలు విలువైన 30 జతల క్రీడా దుస్తులను అందించారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ క్రీడ దుస్తులను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సగుబండి శివరామకృష్ణ ఇతర ఉపాధ్యాయుల చేతులు మీదుగా అభిమాని అందజేశారన్నారు.

'ఉల్లాస్' సామాజిక బాధ్యత : డిఎల్‌డిఒ

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమాన్ని వాలంటీర్ టీచర్లు సామాజిక బాధ్యతగా చేపట్టాలని డిఎల్‌డిఒ హేమసుందర్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం 280 మంది వాలంటీర్ టీచర్లకు ఎంపిడిఒ జి.భాస్కరరావు అధ్యక్షతన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఒ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ఉల్లాస్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అనంతరం వాలంటీర్ టీచర్లకు పుస్తకాలు పంపిణీ చేశారు.

వంగర: ప్రతి వాలంటరీ ఉల్లాస్ తరగతుల ద్వారా గ్రామంలో అక్షరాస్యతను పెంపొందించాలని ఎంపిడిఒ టి.రాజారావు, ఎంపిపి సురేష్ ముఖర్జీ అన్నారు. ఉల్లాస్ నిరక్షరాస్యత నిర్మూలన అమలలో భాగంగా వివిధ గ్రామాల వాలంటరీ టీచర్లకు గురువారం వంగరలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు వెంకటరావు, కూర్మినాయుడు, ఎపిఒ సత్యవతి, జిల్లా రిసోర్స్ పర్సన్‌లు కిషోర్ కుమార్, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా చేసే బాధ్యత ఉల్లాస్ కార్యకర్తలదేనని ఎంపిడిఒ రత్నం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆ కార్యకర్తలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ సన్యాసిరావు, ఎంఇఒ తిరుమల ప్రసాద్, ఇఒపిఆర్‌డి వెంకటరమణ, ఎపిఒ త్రినాధరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ఉల్లాస్ మండల స్థాయి ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిపి ఎం.ఉమాలక్ష్మి, ఎంపిడిఒ రాంబాబు, ఎంఇఒ త్రినాధరావు మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వెలుగులో పనిచేస్తున్న విఒఎ, ఉపాధి హామీ సీనియర్ మేట్లు వాలంటీర్లుగా ముందుకొచ్చి అక్షరాస్యులను తయారు చేయాలన్నారు. అనంతరం పుస్తకాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సుశీల, వెలుగు విఒఎలు, పాల్గొన్నారు.

మెరకముడిదాం: పుస్తకాలు అందిస్తున్న డిఎల్‌డిఒ

మొండి బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - భోగాపురం

బ్యాంకులో తీసుకున్న రుణాలు చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలని డిసిసిబి బ్యాంక్ సిబ్బంది, వెలుగు అధికారులు కోరారు. గురువారం మండలంలోని చేపలకంచేరు గ్రామంలో డీసీసీబీ బ్యాంకు, వెలుగు సంయుక్త ఆధ్వర్యంలో అధికారులు రికవరీ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలోని మహిళా సంఘాలకు 2022లో డీసీసీబీ ద్వారా మంజూరైన రుణాలు ఇప్పటి వరకు తిరిగి చెల్లింపులు జరగకపోవడంతో అవి నాన్ ఫెర్మామింగ్ అసిస్ట్ ఖాతాలుగా మారాయి. ఈ నేపథ్యంలో డీసీసీబీ-భోగాపురం శాఖ మేనేజర్ బెహరా రమేశ్, ఎపిఎం పి.శ్రీనివాసరావు, శాఖ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, భోగాపురం ప్యాక్స్ సిఇఒ ఏ. ఈశ్వరరావు, వెలుగు శాఖ సీసీలు శ్రీనివాసరావు, బి. సత్యనారాయణ తదితరులు గ్రామాన్ని సందర్శించి సంఘ సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు పెద్దలు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రజా సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల సమస్యలను 'గ్రీవెన్స్ డే' ద్వారా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

ఈనెల 10న దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్ర కోటవద్ద జరిగిన బాంబు పేలుళ్లకు కారకులైన ఉగ్రవాద ముష్కరులను కఠినంగా శిక్షించాలని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు కోరారు. ఎర్ర కోట వద్ద జరిగిన బాంబు పేలుళ్ల ఉగ్రవాద చర్యేనని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో కారుణ్య సంస్థ ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో బాంబు పేలుళ్లలో అశువులు బాసిన పౌరులకు కొవ్వొత్తులతో నివాళ్లు తెలియచేస్తూ ఇలాంటి ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారి కుటుంబాలకు కారుణ్య సంస్థ ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తుందని తెలిపారు. అనంతరం రాజు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలించాలన్నారు. దేశ సమైక్యతను, అభివృద్ధిని చూచి ఓర్వలేని పిరికి పందలు చేసే చర్యలు అని అన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం, సమైక్యతను దెబ్బతీసే ఉగ్రమూకలను నామరూపాల్లేకుండా తుడిచి పెట్టాలన్నారు. మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కారుణ్య సభ్యులు జి సిహెచ్ జి శర్మ, చిన్నారావు, రామకృష్ణ, యుగంధర్, చందు, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న జెసి రాజు, తదితరులు

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- డెంకాడ

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. మండలంలోని పెద్ద తాడివాడ పంచాయతీ పరిధిలోని గుండాలపేట గ్రామంలో గురువారం సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. పెద్ద తాడివాడ పంచాయతీతో పాటు మధుర గ్రామాల అభివృద్ధి కోసం సుమారు రూ.2.50కోట్లు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే కొన్ని పనులు పూర్తయ్యాయని మరికొన్ని పనులు జరుగుతున్నాయని తెలిపారు. వైసిపి నాయకులు చేసిన అసత్య ప్రచారాలు నమ్మొద్దని చెప్పారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ కింద విడుదలైన నిధులను మండలంలో అమకాం గ్రామానికి చెందిన దిండి కాశిరాజుకు రూ.18 వేలు, గుణుపూర్ పేట గ్రామానికి చెందిన బడ్డుకొండ నారాయణకు రూ.3లక్షలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, ఎంపిడిఒ వై. భవాని, జనసేన మండల కోఆర్డినేటర్ పైల శంకర్, జనసేన నాయకులు అట్టాడ ప్రమీల, కాళ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కూటమి ప్రభుత్వం ప్రతి రైతు, ప్రతి పశుయజమానిని ప్రోత్సహించేందుకే అంకితభావంతో పనిచేస్తుందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. మండలంలోని గుండాలపేట గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. ఈ పశు వైద్య శిబిరంలో 67 పశువులకు గర్భ కోస చికిత్సలు 43 పశువులకు సాధారణ చికిత్సలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ మురళీకృష్ణ, ఉప సంచాలకులు డాక్టర్ రాధాకృష్ణ, భోగాపురం సహాయ సంచాలకులు డాక్టర్ మహాపాత్రు, డెంకాడ రఘుమండ, అక్కివరం వెటర్నరీ డాక్టర్లు దినేష్ కుమార్, సాగర్, శ్రీకాంత్, సచివాలయ వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.



సిఎం సహాయ నిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

గంజాయి అమ్ముతున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

పట్టణంలోని వ్యాస నారాయణ మెట్ట వద్ద గంజాయి అమ్ముతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు విజయనగరం టూటౌన్ సిఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిబ్బందికి వచ్చిన సమాచారం మేరకు వ్యాస నారాయణ మెట్ట వద్ద వైఎస్ఆర్ నగర్‌కు చెందిన ఎం.మురళీకృష్ణ, కొత్తపేట యాదవ వీధికి చెందిన నెక్కెళ్ళ పవన్ కుమార్, రణస్థలం చెందిన గణేశ్వరం, సంజయ్ కుమార్, యాగంటి గణేష్, బాబామెట్ట పివిజీనగర్‌కు చెందిన పడగల రాకేష్‌లు గంజాయి అమ్ముతుండగా పట్టుకుని అరెస్ట్ చేశామన్నారు. వారి వద్దనున్న ఏడున్నర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కనకరాజు, సిబ్బంది హెచ్‌సి తిరుపతి, సిబ్బంది సత్యనారాయణ, త్రినాధ్, పండు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంఎస్ ఫార్మాలో చోరీ నిందితుల పట్టివేత

పూసపాటిరేగ: మండలంలోని కందివలస పంచాయతీ పరిధిలో గల ఎస్ఎంఎస్ ఫార్మా కంపెనీలో జరిగిన చోరీ కేసులో నిందితులను అరెస్ట్ చేశామని పూసపాటిరేగ ఎస్ఐ దుర్గా ప్రసాద్ తెలిపారు. కంపెనీలో సుమారు రూ.1 లక్ష విలువైన వైర్ దొంగతనం జరిగినట్లు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. దర్యాప్తులో భాగంగా గురువారం ఉదయం కందివలస జంక్షన్ వద్ద నిందితులను పట్టుకున్నామన్నారు. ఏడుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరు భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో సుమారు 20 ట్రాన్స్‌ఫార్మర్‌లను కూడా దొంగతనం చేసినట్లు విచారణలో ఒప్పుకున్నారని వెల్లడించారు. నిందితుల వద్ద నుండి నేరానికి ఉపయోగించిన బొలెరో వాహనంతో పాటు దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

రాముది ఆత్మహత్యే

ప్రజాశక్తి - చీపురుపల్లి

గత నెల 9వ తేదీన బావిలో పడి మృతి చెందిన ఎలకల రాముది ఆత్మహత్య అని చీపురుపల్లి సిఐ జి.శంకర్రావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. మండలంలోని పత్తికాయవలస గ్రామానికి చెందిన ఎలకల రాము అనే యువకుడు సెప్టెంబర్ 9న బావిలో పడి మృతి చెందాడు. రాము పుర్రాయవలస సెంటర్లో గల ఇటుకుల బట్టిలో ప్రొక్లెయినర్ ఆపరేటర్‌గా వండాన సన్యాసిరావు దగ్గర పని చేసేవాడు. రాముకు జీతం సరిగా ఇవ్వడం లేదని యజమాని వండాన కన్యాసిరావును ప్రశ్నించాడు. దీంతో వీరిద్దరి మధ్య వివాదం జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన ఎలకల రాము అక్కడే ఉన్న కంది త్రినాథ్‌కి సంబంధించిన నేలబావిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకుముందే యజమాని సన్యాసిరావు, మృతుని బంధువులు స్థానిక పోలీసు స్టేషన్‌లో రాము కనిపించడంలేదని ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా పెద్దింటి కృష్ణ అనే వ్యక్తి అటువైపు వెళుతుండగా నూతిలో పడి ఉన్న రాముని చూసి సంబంధిత యజమానికి తెలియజేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి గ్రామ పెద్దల సమక్షంలోనూ పోస్టుమార్టం చేయించారు. రెండు రోజులు తర్వాత తమ కుమారుడు మృతి పట్ల అనుమానాలు ఉన్నట్లు రామ బంధువులు పోలీస్ స్టేషన్‌కి మరొకసారి ఫిర్యాదు చేశారు. దీంతో ఇటిక బట్టిలో పనిచేస్తున్న వారిని, యజమాని సన్యాసిరావుని విచారించాం. గొడవ జరిగిన మాట వాస్తవమే అయినా అతని మృతికి తనకు సంబంధం లేదని పోస్టుమార్టం రిపోర్టుతో తేలినట్లు సిఐ తెలిపారు.

ఎహెచ్‌ఎపై ఫిర్యాదు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని తలగాం, మడ్డువలస సచివాలయాల పరిధిలో ఇటీవల పని చేసిన పశుసంవర్ధక సహాయకుడు (ఎహెచ్ఎ) నరసింహమూర్తి (ప్రవీణ్)పై సంతకవిటి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎడి సి.హెచ్ తిరుపతి రావుకు గురువారం మండలంలోని సీతారాంపురం గ్రామస్తులు వంగరలో ఫిర్యాదు చేశారు. మండలంలోని ఎం. సీతారాంపురం గ్రామానికి చెందిన నరసింహమూర్తి 2019 నుండి వంగర మండలంలో పని చేసిన కాలంలో తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి విధులకు హాజరుకాకుండా జీతం తీసుకునేవాడని, ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని, రాజకీయ కార్యకలాపాలలో పాల్గొంటున్నాడని ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలంలోని సామరిల్లికి బదిలీ అయినప్పటికీ విధులకు వెళ్లకుండా ఆయన స్వగ్రామం ఎం.సీతారామపురంలోనే ఉంటున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న నరసింహమూర్తిపై సమగ్రమైన విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎడి తిరుపతిరావు దర్యాప్తు చేసి నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫిర్యాదు దారులు లెంక సింహాచలం, దన్నాన అప్పలనాయుడు, కాంబోతుల ఉమామహేశ్వరరావు, వావిలపల్లి గణేష్, సీతారామ్ దొర పాల్గొన్నారు.